క్లుప్తంగా

బీఆర్ఎస్ కోరిక అర్థరహితం



బాల్కొండ: మూడోసారి అధికారమివ్వాలని బీఆర్ఎస్ కోరడం అర్థరహితమని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. ముప్కాల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏం సాధించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి కేవలం కమీషన్ల కోసమే పని చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ జైడి రవి, నాయకులు సాగర్‌రెడ్డి, సాజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవ సభలను నిర్వహించాలి

మాక్లూర్: అమరవీరుల వారోత్సవ సభలను ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి దుద్దు గంగాధర్ పిలుపునిచ్చారు. మండలంలోని మదన్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన అమరవీరుల వారోత్సవసభకు గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం మండల కార్యదర్శి పోతన్న, లక్ష్మణ్, సుమన్ పాల్గొన్నారు.

మైనారిటీ కళాశాల విద్యార్థి ప్రతిభ



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ ఇర్ఫాన్ స్పార్క్ ఫెస్ట్ ఇంగ్లిష్ డిబేట్ పోటీలో ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి అందుకున్నారు. హైదరాబాద్‌లో టీఎంఆర్ఈఐఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్పార్క్ ఫెస్ట్ డిబేట్ పోటీలను శనివారం నిర్వహించారు. టీఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి షఫీఉల్లా చేతుల మీదుగా బహుమతి అందుకున్న ఇర్ఫాన్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ముబీన్ అభినందించారు. విద్యార్థిని ప్రోత్సహిస్తున్న లెక్చరర్ నవీన్, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ సేవాట్రస్ట్ ఎన్నిక

బోధన్: పట్టణంలోని భీమునిగుట్టపై వెలిసిన అయ్యప్పస్వామి ఆలయ సేవ ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెంపాటి శివన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా సురాబత్తుని శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఐఆర్ చక్రవర్తి, సహాయ కార్యదర్శిగా కటకం రమేశ్, కోశాధికారిగా కొయ్యాడ శ్రీనివాస్‌గౌడ్, సభ్యులుగా గోవింద్‌రెడ్డి, కొడాలి కిషోర్, స్వామిగౌడ్, అబ్బారెడ్డి, కంబోజు సత్యనారాయణ, మాశెట్టి నర్సయ్య, ఈరడి పోశెట్టి, చల్లా శ్రీనివాస్‌రావు, పురాణిక్ సంతోష్ శర్మ ఎన్నికయ్యారని మేనేజింగ్ ట్రస్టీ గంజి వెంకటేశం తెలిపారు.

బహుజన రాజ్యాధికారం సాధిద్దాం

ఆర్మూర్‌టౌన్: బడుగుబలహీన వర్గాలు, మైనారిటీలు, దళితులు బాగుపడాలంటే బీఎస్పీకి ఓటు వేసి బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని బీఎస్పీ జిల్లా కన్వీనర్ అరుణతార అన్నారు. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో ఉన్న వడ్డెర సంఘంలో ఆదివారం పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా గండికోట రాజన్నను ప్రకటించినందుకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నాయకులు పిట్ల శ్రీనివాస్, రవి, అల్లెపు రాజులు, బండారి గంగాధర్, దండుల భాజన్న, మక్కల సాయిలు, దండుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆర్మూర్‌టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొనికొండ అశోక్ అన్నారు. ఆదివారం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, కమలాకర్, సుంకే శ్రీనివాస్, కొంతం రాజు, కోశాధికారి ఎర్ర భూమయ్య, మ్యాకల అశోక్, ఎల్టీ కుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు

బోధన్‌రూరల్(బోధన్) : బోధన్, సాలూర మండలాల పరిధి నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని సిద్దాపూర్ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

మాయమాటలను నమ్మి మోసపోవద్దు

- మానవీయకోణంలో బీమా పథకం
- ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బోనాలు, వల గొడుగులతో బ్రహ్మరథం పట్టిన ప్రజలు



వేల్పూర్ మండలం వాడిలో ప్రశాంత్‌రెడ్డికి గొర్రెపిల్లను బహూకరించిన యాదవులు
పచ్చలనడ్కుడలో బోనాలు, వలగొడుగులతో మంత్రికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేల్పూర్: కాంగ్రెస్ చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ, కొత్తపల్లి, వాడి గ్రామాల్లో మంత్రి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలన్నీ బూటకమేనని, కర్ణాటకలో కనీసం ఐదు గంటలపాటు కరెంటు ఇవ్వడం లేదన్నారు. ఇక్కడి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలు చెప్పి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోదీ గ్యాస్ ధరను రూ.1200 లకు పెంచారని, మరింత పెంచుతారని చెప్పారు. మోదీ ధరలను ఎంత పెంచినా కేసీఆర్ మాత్రం రూ. 400లకే సిలిండర్ ఇప్పించి, మిగితా భారాన్ని భరిస్తారని అన్నారు. అమెరికాలో కూడా లేని విధంగా మానవీయకోణంలో ఆలోచించి కేసీఆర్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. భూమిలేని వారి ఇంట్లో కూడా కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకుంటారన్నారు. పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడిలో వల గొడుగులతో, బోనాలతో రైతులు, మహిళలు, మంత్రికి స్వాగతం పలికారు. ఐబిహెచ్ఎఫ్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, సర్పంచులు గంగారెడ్డి, నితీశ్‌కుమార్, గోపు మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వేల్పూర్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో వేల్పూర్, భీమ్‌గల్, ఏర్గట్ల మండలాలకు చెందిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అంక్సాపూర్ ఎంపీటీసీ పడిగెల రవి, భీమ్‌గల్ బీజేపీ నాయకుడు మహేశ్, ఏర్గట్ల మండలం తడ్‌పాకలకు చెందిన బీజేపీ నాయకుడు, మాజీ దేవాదాయ శాఖ చైర్మన్ ఇప్ప గంగారెడ్డి, తాళ్లరాంపూర్ సొసైటీ డైరెక్టర్ సాయిరాం, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్, సాగర్, ఇతర పార్టీలకు చెందిన సుమారు వంద మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రశాంత్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి

- అన్నారం, నికాల్‌పూర్‌లో ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రచారం



నికాల్‌పూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోరారు. 'ప్రజా ఆశీర్వాదయాత్ర'లో భాగంగా ఆదివారం డొంకేశ్వర్ మండలంలోని అన్నారం, సిర్పూరం, కోమట్‌పల్లి, నికాల్‌పూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎన్నో జరిగాయని, పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే.. పింఛన్లు, రైతుబంధు నిధులు పెరుగుతాయని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందజేస్తామన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఉండవని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు మంగ్లారం పోశన్న, గడ్డం లావణ్య, నాగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరసన..

అన్నారం గ్రామ కమాన్‌వద్ద కొందరు ప్లకార్డులు పట్టుకుని జీవన్‌రెడ్డికి నిరసన తెలిపారు. తమ గ్రామంలోకి రావొద్దని నినాదాలు చేశారు. అనంతరం ఆందోళన విరమించారు.

జీవన్‌రెడ్డి సతీమణి ప్రచారం

ఆర్మూర్ : ఆర్మూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని ఆయన సతీమణి రజితారెడ్డి కోరారు. ఆర్మూర్ మండల కేంద్రంతోపాటు ఫతేపూర్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మహిళా నాయకులు ఉన్నారు.

జీవో 317తో ఉపాధ్యాయులకు అన్యాయం



బాబాపూర్‌లో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్ : జీవో నం.317 కారణంగా ఉపాధ్యాయులకు తీవ్రఅన్యాయం జరిగిందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని పురాణీపేట్, బాబాపూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భీమ్‌గల్ మండలాన్ని గంజాయి సరఫరాకు కేరాఫ్ అడ్రస్‌గా బీఆర్ఎస్ నాయకులు మార్చారని విమర్శించారు. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను సరిగా చేపట్టకపోవడంతో బాబాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు సరస్వతి ఆత్మహత్యకు పాల్పడిందని, సరస్వతి చనిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కారణమని ఆరోపించారు. నియోజకవర్గంలో గంజాయి, అవినీతి, అక్రమాలు అంతమవ్వాలంటే బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్, మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్, హకీం, సోము నవతేజ్, అన్వేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

భీమ్‌గల్ : పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ



కుకునూర్‌లో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని బాల్కొండ నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో రూ.2500, రైతుకు పెట్టుబడి సహాయం రైతుభరోసా ద్వారా ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని, వృద్ధులు, వికలాంగులు, మహిళలకు రూ.4 వేల పింఛను అందిస్తామన్నారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, ఇంటిని నిర్మించుకునేవారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్‌ను నమ్మి మోసపోయామన్నారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి తనను బాల్కొండ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



తాడ్‌బిలోలిలో బోనాలతో మహిళలు



ముప్కాల్ మండలం రెంజర్లలో..

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గోదావరి తీరం నుంచి పవిత్రజలాలను తీసుకువచ్చి వలగొడుగుతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, వీడీసీ సభ్యులు, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానాకలాన్‌లో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం తానాకలాన్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మహాలక్ష్మి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కులసంఘాల ఆధ్వర్యంలో కులదేవతలకు బోనాలు సమర్పించారు. ఆయా గ్రామాల సర్పంచులు మర్ల రమేశ్‌కుమార్, వెల్మల సునీత, రొడ్డ విజయ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో విద్యానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వెంకటేశ్వ కాలనీవాసులు శిలఫలాకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనపై విద్యానగర్ కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసరాల ప్రాంతాల్లో ఊరేగిస్తామన్నారు.

రాజేందర్‌కు సముచితస్థానం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడిన జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సముచిత స్థానం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్‌తో కలిసి రాజేందర్ హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రేవంత్ సూచించినట్లు రాజేందర్ తెలిపారు.

బీఎస్పీకి రాజీనామా

భీమ్‌గల్ : బీఎస్పీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి చెప్పాల గణేష్ ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేసిన తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో బీఎస్పీ విఫలమైందని విమర్శించారు. పార్టీకి ఎంతో సేవ చేసి, గెలిచే అవకాశం ఉన్న తనకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

బోధన్: వీరశైవుల ఆరాధ్యదైవం మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో కొలువైన శ్రీక్షేత్రం కపిల్‌ధార్ మన్మథస్వామి పుణ్యక్షేత్రానికి చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలో వీరశైవ జంగమ, లింగాయత్ సమాజ్‌ల జిల్లా, పట్టణ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ నెల 13న ప్రారంభం కానున్న పాదయాత్ర 350 కిలోమీటర్ల మేర కొనసాగుతుందని వారు తెలిపారు. వీరశైవ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వీఆర్ దేశాయ్, జంగం సమాజ్ ప్రతినిధులు అజయ్‌కుమార్, నర్సింగ్ అప్పా, యాదవరావు పటేల్ పాల్గొన్నారు.

అక్రమాలు, అన్యాయాన్ని ఎదిరించా

- కేసీఆర్, కేటీఆర్ నాన్ లోకల్‌లో పోటీ చేయడం లేదా..?
- బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలో కొనసాగిన అవినీతి, అక్రమాలను గతంలో తాను ఎదిరించానని బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. సింగూర్ నీటి కోసం తాను పోరాటం చేశానని గుర్తు చేశారు. రుద్రూర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను నాన్‌లోకల్ అంటూ బీఆర్ఎస్ నాయకులు సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారని, సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాన్‌లోకల్ సెగ్మెంట్లలో పోటీ చేయడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో బాన్సువాడ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ కె భాస్కర్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఔరంగాబాద్ ప్రవీణ్, శ్రీనివాస్ ఖర్గె, పైడిమల్ లక్ష్మీనారాయణ, ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు హరికృష్ణ, ఇల్తెపు శంకర్, కాపు గాండ్ల శ్రీనివాస్, ప్రకాశ్ పటేల్ , నాయకులు తోట శంకర్, కృష్ణంరాజు, కుర్మాజీ సాయిలు, కల్లూర్ శంకర్‌రావ్, బజరంగ్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల్లో చేరికలు

మాక్లూర్/పెర్కిట్(ఆర్మూర్)/భీమ్‌గల్: మాక్లూర్ మండలం గుత్ప ఉపసర్పంచ్ దొడ్ల రాఘవేందర్, మాజీ సర్పంచ్ డి రాజు, ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ సాందన్న, బీఆర్ఎస్ నాయకుడు కిషన్‌గౌడ్ బీజేపీలో చేరారు. మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న ఆధ్వర్యంలోయువకులు భారీ సంఖ్యలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భీమ్‌గల్ మండలం బాబానగర్ మాజీ సర్పంచ్ నాగుల భూమన్న ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా, ఏలేటి అన్నపూర్ణమ్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లో..

మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన 52 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో..

బాల్కొండ/వేల్పూర్/కమ్మర్‌పల్లి: మెండోరా మండలం వెల్కటూర్, పడగల్, పచ్చలనడ్కుడ, లక్కోర, కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. సునీల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సిద్దాపూర్ గ్రామస్తులు

వర్ని: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని సిద్దాపూర్, భీమునిగుట్టతండా, చింతల్‌పేట్, పైడిమల్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా నియోజకవర్గ అభివద్ధికి ఎంతో కృషి చేశానని, సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దిన ఘనత తనకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు, డబుల్‌బెడ్ రూం ఇండ్లు, పింఛన్ల మంజూరులో నియోజకవర్గానికి అధికప్రాధాన్యత ఇచ్చామన్నారు. తన జీవితాన్ని నియోజకవర్గ ప్రజలకు అంకితం చేశానన్నారు. జెడ్పీటీసీ హరిదాసు, సర్పంచులు కలియబాయి దశరథ్, భారత్‌నాయక్, ప్రభ దేవేందర్, పార్టీ మండల అధ్యక్షుడు గిరి, వర్ని మండల ఉపాధ్యక్షుడు బాలరాజు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, వీర్రాజు పాల్గొన్నారు.

నేడు రుద్రూర్‌లో ప్రచారం

రుద్రూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం అంబం(ఆర్) నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తారని, రాణంపల్లి, చిక్కడపల్లి, సిద్దాపూర్, రాయకూర్ క్యాంపు, రాయకూర్, సులేమాన్‌నగర్‌లో కొనసాగుతుందన్నారు.

బీజేపీతోనే బోధన్ నియోజకవర్గ అభివృద్ధి

- బోధన్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి



నవీపేటలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి

నవీపేట: బీజేపీతోనే బోధన్ నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని బోధన్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అవకాశమిచ్చినా బోధన్‌లో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. అభివృద్ధిని విస్మరించిన మాజీలే మళ్లీ బరిలోకి దిగడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. ఈ సారి జరగబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కోరారు. ప్రతి కార్యకర్త ఈ 25 రోజులూ సైనికుడిలా పని చేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. రెంజల్ ఎంపీపీ రజిని, జెడ్పీటీసీ విజయ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూర్ శ్రీనివాస్, నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాల అధ్యక్షులు ద్యాగ సరిన్, గోపికృష్ణ, ఇంద్రకరణ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా గురవయ్య

రెంజల్(బోధన్): వీరన్నగుట్ట గ్రామానికి చెందిన గురువయ్యను బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉత్తర్వు ప్రతిని నియోజకవర్గ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి గురువయ్యకు అందించారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు మోహన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలతో ఎమ్మెల్యే షకీల్

బోధన్/బోధన్‌రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ అన్నారు. బోధన్ మండలంలోని జాడిజమాల్‌పూర్, సాలూర క్యాంప్ గ్రామాల్లో పలువురు ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్‌కు మద్దతుగా సోమవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని శక్కర్‌నగర్ ఎన్ఎస్ఎఫ్ మైదానంలో కులసంఘాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు కుల సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ సమ్మేళనానికి హాజరవుతారన్నారు. సీఎం కేసీఆర్ కుల వృత్తులకు జీవం పోశారని, అన్నీ కులాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని ప్రతినిధులు పేర్కొన్నారు. మూడోసారి కూడా కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నామని, షకీల్‌ను గెలిపించుకుంటామన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర గంగారాం, శివాలయం కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, ఆయా కుల సంఘాల ప్రతినిధులు సుదర్శన్ గౌడ్, నక్క లింగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, గుమ్ముల శంకర్‌రెడ్డి, సాయరెడ్డి పాల్గొన్నారు.

పురోహిత సమాఖ్య అధ్యక్షుడిగా శ్రీనివాసశర్మ

నిజామాబాద్ సిటీ: ఇందూరు గాయత్రీ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడిగా శ్రీనివాస శర్మను సభ్యులు ఎన్నుకున్నారు. వినాయక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం పురోహిత సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి యుగంధర్ ఆధ్వర్యంలో సమాఖ్య అధ్యక్షుడిగా శ్రీనివాస శర్మను 160 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమాఖ్య నూతన ఉపాధ్యక్షుడిగా అయాచితం శ్రీహరిశర్మ, కార్యదర్శిగా పిట్టల సుభాష్‌శర్మ, కోశాధికారిగా భాష్యం కృష్ణమాచారి, ఉపకార్యదర్శిగా జోషి రవీందర్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యుగంధర్ ప్రకటించారు. నూతన కార్యవర్గ సభ్యులను గౌరవ అధ్యక్షుడు వేలేటి పశుపతి శర్మ, పవన్ శర్మ, జనగామ చంద్రశేఖర శర్మ, అజయ్ సంగ్వాయి తదితరులు అభినందించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీటీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఘోస్ట్- 10.15,
టైగర్ నాగేశ్వరరావు - 01.10
నరకాసుర (తెలుగు) - 04.35
ఘోస్ట్- 7.35
భగవంత్ కేసరి (తెలుగు) - 10.30

స్క్రీన్-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20
లియో (తెలుగు) - 4.05

స్క్రీన్-3 – కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00

స్క్రీన్-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35
విధి (తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్ - 10.00